
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 19 మే 2024







పల్నాడుకు కొత్త బాస్‌లు

- కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేష్ బాలాజీ
- ఎస్పీగా మాలికా గార్గ్

నరసరావుపేట, మే 18: పల్నాడు జిల్లాకు కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేష్ బాలాజీ, ఎస్పీగా మాలికా గార్గ్ నియమితులయ్యారు. జిల్లాలో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన హింసపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాలో కీలక అధికారులపై కొరడా ఝుళిపించింది. కలెక్టర్ శివ శంకర్ లోతేటిని బదిలీ చేసింది. ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు జిల్లాలో ఆరుగురు పోలీసు అధికారులను సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. సదరు అధికారులపై శాఖపరమైన చర్యలకు ఈసీ ఆదేశించింది.

మాలికా గార్గ్ గతంలో కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకు పైగా పనిచేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. మాలికా గార్గ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పోలీస్ అధికారిని. ఆమె భర్త వకుల్ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు.

లత్కర్ శ్రీకేష్ బాలాజీ 2011 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన అధికారి. గతంలో ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కో-ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం లత్కర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై కలెక్టర్‌గా రానున్నారు.

గ్రహణం వీడేనా?



రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామిక జిల్లాల్లో ఒకటిగా ఉన్న గుంటూరు జిల్లాలో పారిశ్రామిక రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా జిల్లాలో కొత్తగా పరిశ్రమలు వచ్చే పరిస్థితే లేకుండా పోయింది. పరిశ్రమాధిపతులపై అధికార వైసీపీ నేతల బెదిరింపులు, వేధింపులు, రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యల కారణంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎవరూ జిల్లాలో పరిశ్రమలు పెట్టేందుకు ముందు కు రాలేదు. అధికార పార్టీకి కప్పం కట్టలేక చాలా మంది తమ ప్రయత్నాలను మాను కున్నారు. లేదంటే పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో జిల్లాలో చెప్పుకో దగిన పరిశ్రమ ఒక్కటీ రాలేదంటే ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

- గడిచిన ఐదేళ్లలో జిల్లా పారిశ్రామిక రంగం కుదేలు
- జిల్లాలో మచ్చుకైనా కానరాని పారిశ్రామిక ప్రగతి
- భారీ, మధ్య తరహా పరిశ్రమల స్థాపన శూన్యం
- ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనలోనూ అదే దుస్థితి
- ప్రభుత్వ వైఖరితో పక్క రాష్ట్రాల వైపే అందరి చూపు
- రానున్న రోజుల్లోనైనా పరిస్థితి మారేనా?

గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన ఉమ్మడి జిల్లాకు పారిశ్రామికరంగంలో శాపంగా పరిణమించింది. విభజిత గుంటూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ఏమాత్రం అవకాశం లేకుండాపోయింది. కాగా సున్నపురాయి, నాపరాయి వంటి వనరులు, అటవీ సంపదను కలిగి వుండి, ఉమ్మడి జిల్లాలోని మొత్తం పరిశ్రమల్లో రెండింట మూడొంతుల పరిశ్రమలను పొందిన పల్నాడు జిల్లా పరిస్థితి కూడా అలానే వుండడం విషాదం. సముద్రతీరం, ఆక్వారంగం విస్తారంగా వున్న బాపట్ల జిల్లా పరిస్థితి కూడా ఇంచుమించు అలానే వుంది. 2022 ఏప్రిల్‌లో జరిగిన జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 16,020 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, కోటి నుంచి 50 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు 15,938 ఉన్నాయి. విభజనలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 81 భారీ పరిశ్రమల్లో 53 పరిశ్రమలు పల్నాడు జిల్లాకే దక్కాయి. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి భారీ సిమెంటు పరిశ్ర మలు, పిడుగురాళ్ల కేంద్రంగా ఉన్న సున్నపు బట్టీల పరిశ్రమ, చిలకలూరి పేట స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్ హబ్‌లు అన్నీ పల్నాడు పరమయ్యాయి. బాపట్ల జిల్లాకు 2 భారీ పరిశ్రమలు పోగా మిగిలిన 26 పరిశ్రమలతో గుంటూరు జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. కాగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 15,938 ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో దాదాపు 8 వేల ఎంఎస్ఎంఈలు పల్నాడుకే దక్కాయి. మిగిలిన వాటిలో సుమారు 1500 ఎంఎస్ఎంఈలు బాపట్ల జిల్లాకు పోగా గుంటూరు జిల్లాకు 6,425 పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. అయితే భారీగా పరి శ్రమలు వున్న పల్నాడు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని భావించినా, గడిచిన రెండేళ్లలో అలాంటి పరి స్థితి ఏమాత్రం కనిపించలేదు. రాజధాని జిల్లాగా వున్న గుం టూరులో రోడ్డు, రైలుమార్గాలు విస్తారంగా వున్నా పరిశ్రమల స్థాపన జరగలేదు. అందుకు కారణం ప్రభుత్వ కక్ష సాధింపు వైఖరే అని తెలుస్తోంది.

సూక్ష్మ పరిశ్రమలదీ అదే దుస్థితి

సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి(ఎంఎస్ఎంఈ) పరిశ్రమలకు జిల్లాలో తగిన స్థానం దక్కలేదు. కిందటేడాది రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ పరిశ్రమల స్థాపనకు భారీ లక్ష్యాలను నిర్ణయించుకుని నానా హడావుడి చేసినా పరిశ్రమల స్థాపన జరగలేదు. రూ.లక్ష నుంచి 5 లక్షల లోపు పెట్టుబడులతో ఒకరు లేక ఇద్దరికి ఉపాధి కల్పించే అతి చిన్న పరిశ్రమలు స్థాపించడానికి కూడా సాహసించలేని పరిస్థితి ఉండడంతో లక్ష్యాల్లో మూడో వంతు పరిశ్రమలు కూడా స్థాపించలేకపోయారు. గుంటూరు జిల్లాలో రూ.750 కోట్లతో 6,000 ఎంఎస్ఎంఈలు స్థాపించి 7,500 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 365.4 కోట్ల పెట్టుబడులతో 2,197 ఎంఎస్ఎంఈలను స్థాపించారు. బాపట్ల జిల్లాలో రూ.500 కోట్లతో 4,000 ఎంఎస్ఎంఈలను స్థాపించాలనుకోగా రూ.239 కోట్లతో 1,516 ఎంఎస్ఎంఈలను స్థాపించారు. పల్నాడు జిల్లాలో రూ.625 కోట్ల పెట్టుబడితో 5000 ఎంఎస్ఎంఈలను స్థాపించాలనుకోగా రూ.16.6 కోట్లతో కేవలం 410 ఎంఎస్ఎంఈలు మాత్రమే స్థాపించారు.

ఐదేళ్ల గ్రహణం వీడేనా?

గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అనేది జిల్లాలోని యువతకు కలగానే మిగిలిపోయింది. ఖనిజ, సహజ వనరుల ఖిల్లాగా ఉన్నా, రోడ్లు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల కల్పన విస్తారంగా వున్నా జిల్లాలో పారిశ్రామిక ప్రగతి కుంటుబడిపోయింది. ఈ కారణంగా జిల్లాలోని యువతకు పని దొరకడమే కష్టంగా మారిపోయింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఇకనైనా తమ రాతలు మారాలని వారు బలంగా కోరుకుంటున్నారు. ఇదే ప్రభుత్వం మళ్లీ వస్తే తమ బతుకుదెరువు, భవిష్యత్తు రెండూ కనుచూపు మేరలో కనిపించవన్న భయం వారిని వెంటాడుతోంది. ఈ క్రమంలోనే వారంతా ప్రభుత్వం మారాలని, తద్వారానే తమ తలరాతలు మారతాయని బలంగా నమ్ముతున్నారు.


రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

గత చంద్రబాబు ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. 2014- 21 మధ్య కాలంలో గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా 2,485.47 కోట్ల రూపాయల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. కాగా 2021- 22, 2022- 23 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగాని, ఒక్క రూపాయి పెట్టుబడిగానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని సాక్ష్యాత్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వేనే చెబుతోంది.



ఫుల్‌గా.. తాగేశారు..

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దిమ్మ తిరిగేలా మద్యం అమ్మకాలు
- 56 రోజుల్లో 235.31 కోట్ల లిక్కర్ అమ్మకాలు
- కోట్ల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కుమ్మరించారు...



గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): గతంలో ఏ ఎన్నికల్లో లేని రీతిలో ఈ పర్యాయం మద్యం ఏరులై పారింది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఓటర్లను మత్తులో ముంచే ప్రయత్నం చేశారు. తమ పాలనతో ప్రజలు అన్ని రకాలుగా విసుగు చెందారని ముందుగానే గుర్తించిన వైసీపీ అభ్యర్థులు ఓటర్లకు అవేవీ గుర్తుండకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మత్తు దిగగానే వారు తమ ప్రతాపం చూపించారు. ఈ ఐదేళ్లలో మద్యం వ్యాపారాన్ని సైతం ప్రభుత్వం పేరుతో వైసీపీ పాలకులు తమ హస్తగతం చేసుకున్న విషయం తెలి సిందే. దీంతో మద్యం దుకా ణాల మధ్య పోటీ లేకపోవటం తో పాలకుల ఇష్టారాజ్యం అయి పోయింది. జె బ్రాండ్‌గా ప్రజలు పిలు చుకునే నాసిరకం మద్యంను మాత్రమే షాపుల్లో ఉంచి అమ్మించారు. వాటికి కూడా అధిక ధరలు పెట్టి పేదలను దోచుకున్నారు. కేవలం నగదుతోనే అమ్మకాలు జరిపించి లాభాల లెక్కలను గోల్‌మాల్ చేసి ఎన్నికల ఫండ్‌కు వాటిని మరలించినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇలా పేదల నుంచి దోచుకున్న సొమ్ముతోనే తిరిగి మద్యం రూపంలో వారికే ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ అధిష్టానం పన్నిన కుయుక్తులు పారలేదు. ఎన్నికలకు రెండు, మూడు నెలలు ముందు కూడా నాసిరకం మద్యం సీసాలతోనే షాపులను నింపిన వైసీపీ ప్రభుత్వం హఠాత్తుగా ఓటర్లపై ప్రేమ చూపుతూ మంచిరకం మద్యం కూడా వైన్‌షాపుల్లో ఉండేలా చూశారు. దీనికి కూడా ప్రధాన కారణం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన ఎన్నికల ప్రచార సభల్లో జె బ్రాండ్ పేరుతో పేదలను దోచుకోవటమే కాకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, సీఎం జగన్‌పై ఆగ్రహం వెలిబుచ్చుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంచి మద్యాన్ని మాత్రమే అమ్మిస్తామనే చెప్పటంతో ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్య పెట్టేందుకు కొద్దిరోజుల పాటు మురిపించారు. కాగా ఎన్నికల జాతర ప్రారంభమై ముగిసిన 56 రోజుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ.235.31 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు రికార్డుల్లో చూపారు. వాస్తవానికి ఇందులో 10 శాతం కూడా ప్రజలు నేరుగా కొనుక్కొని తాగింది ఉండదు. మిగతా అంతా కూడా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ముఖ్యంగా వైసీపీ క్యాండెట్స్ కొనుగోలు చేసి పంపిణీ చేసేందేనని చెప్పుకోవచ్చు. గత్యంతరం లేక టీడీపీ అభ్యర్థులు కూడా తాము మద్యం పంపిణీ చేసేందుకు కొనుగోలు చేయాలని ప్రయత్నించినప్పటికీ సింహభాగం తమ పార్టీ అభ్యర్థులకే దక్కేలా వైసీపీ పెద్దలు అధికార దర్పంతో చేశారు. దీంతో ప్రతిపక్షంలో ఉన్న కూటమి అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉండే బార్ యజమానుల నుంచి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేయాల్సి వచ్చింది. నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16 నుంచి ఈనెల 11వ తేదీ వరకు (పోలింగ్ తేదీకి రెండు రోజులు ముందు షాపులు మూసివేశారు) 2,60,200 కేసులు లిక్కర్ అమ్మకాలు జరిగాయి. అంటే బ్రాందీ, విస్కీ వంటి మద్యం, బీరు అమ్మకాలు 76,100 కేసులు అమ్మారు. ఇదంతా అధికారుల లెక్కల్లోఉండే మద్యం అమ్మకాల చలామణీ మాత్రమే ఇక ఏపీలో కంటే పొరుగురాష్ట్రాల్లో మద్యం చౌకగా లభిస్తుండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ఆ రాష్ట్రాల నుంచి లారీల్లో తమ తమ నియోజకవర్గాలకు తరలింప చేసుకొని గడ్డివాముల్లో నిల్వ చేసి విడతల వారీగా ఎన్ని కల ప్రక్రియ ముగిసే వరకు పంపిణీ చేశారు. దీని విలువ అంచనాకు అందనప్పటికీ కోట్లల్లోనే ఉంటుందని చెప్పవచ్చు. విశేషమేమిటంటే ప్రభుత్వం ఎన్నికల నియమావళి ప్రకారం 11వ తేదీనే దుకాణాలను మూయించి సీల్ వేసినప్పటికీ అప్పటికే తమ తమ స్థావరాల్లో రహస్యంగా ఉంచిన మద్యాన్ని సాధారణ రోజుల్లో కంటే ఎక్కువగా పారేలా చేశారు.

దాడులు జరుగుతుంటే.. ఏం చేస్తున్నారు

- పోలీసులపై సిట్ బృందం ప్రశ్నల వర్షం
- పోలింగ్ అరాచకాలపై విచారణ ప్రారంభం
- నరసరావుపేట, రెంటచింతల పోలీస్‌స్టేషన్లలో విచారణ

నరసరావుపేట, రెంటచింతల, మే 18: దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.. ఘటనలపై ముందస్తు సమాచారం ఉంది కదా.. ముందస్తు ఏం చర్యలు తీసుకున్నారు.. విధ్వంసం సృష్టిస్తున్న వారిని ఎందుకు అడ్డు కోలేకపోయా రు.. అంటూ సిట్ బృందం పోలీసు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక సంఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో విచారణకు నియ మించిన సిట్ బృందం శనివారం రంగంలోకి దిగింది. సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు సిట్ బృందంలోని సభ్యురాలు ఏసీబీ ఏఎస్పీ సౌమ్యలత విచారణ చేశారు. నరసరావుపేట రెండో పట్టణ, రెంటచింతల పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఘటనలు, నమోదైన కేసుల వివరాలను స్థానిక పోలీసు అధికారుల నుంచి సేకరించారు. నరసరావుపేటలో పోలింగ్ రోజున జరిగిన రెండు హత్యాయత్నం, రెండు అట్రాసిటీ, ఓ కారు దహనం కేసుల వివరాలను సౌమ్యలత పరిశీలించారు. అనంతరం రెంటచింతల పోలీసు స్టేషన్ సందర్శించిన సిట్ బృందం మండలంలో జరిగిన ఘటనలపై వివరాలను సేకరించింది. నమోదైన కేసులు, వాటి ఎఫ్ఐఆర్‌లను పరిశీలించింది. దాడుల్లో గాయపడిన వారి వివరాలతో పాటు వారు ఎక్కడ చికిత్స పొందుతున్నారన్న వివరాలను తీసుకున్నారు. పిన్నెల్లిలో ఈవీఎంలను ధ్వంసం రెంటాలలో పోలింగ్ ఏజంట్లపై వేట కొడవళ్లతో దాడి, జెట్టిపాలెం, తుమ్మకోట గ్రామాల్లో జరిగిన ఘర్షణలపై సిట్ వివరాలను సేకరించింది. కారంపూడిలో మరణాయుధాలతో స్వైర్వవిహారం చేసిన సంఘటన వివరాలను సిట్ సేకరిస్తోంది. గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల్లో జరిగిన ఘటలపై సిట్ వివరాలు సేకరించనున్నది.



విచారణలో సిట్ అధికారి సౌమ్యలత

అరెస్టులు.. ఆందోళనలు

జిల్లాలో పోలింగ్ విధ్వంసాలు, దాడులపై సిట్ బృందం విచారణను ముమ్మ రం చేసింది. ఆదివారానికి విచారణను పూర్తి చేసి ఈసీకి నివేదిక పంపనుంది. ఈ క్రమంలో గొడవలతో సంబంధం ఉన్న రాజకీయ పార్టీ నేతల అరెస్టుకు రంగం సిద్ధమవుతుందని సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపైనా చర్యలుకు సమాయత్తమవుతున్నారు. అడ్డగోలుగా వ్యవహకరించిన పోలీసు అధికారులపై చర్యలు కఠినంగా ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. దీంతో అటు పోలీసు అధికారులు, ఇటు రాజకీయ నేతలు ఆందోళనలో ఉన్నారు. ఘటనలకు సంబంధించిన రాజకీయ పార్టీల నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇప్పటికే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు మాచర్ల వదలి పరారైన విషయం తెలిసిందే.

శరవేగంగా రహదారి పనులు

- నాలుగు వరుసల్లో వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు
- రెండేళ్లలో పనులు పూర్తి అవుతాయని అధికారుల అంచనా

పర్చూరు, మే 18: వాడరేవు - పిడుగురాళ్ల రోడ్డు నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం చొరవతో రోడ్డు పనులకు గ్రహణం వీడింది. నేషనల్ హైవే 167(ఏ) ఎన్‌హెచ్ఏఐ కింద రోడ్డు నిర్మాణానికి రూ.825.76 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆశాఖ అధికారులు తెలిపారు. భూసేకరణ పూర్తి కావడంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో పనులను ప్రారంభించారు. దీంతో రోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. వాడరేవు నుంచి చిలకలూరిపేట 47 కిలో మీటర్లు ఒక భాగం గా, చిలకలూరిపేట - పిడుగురాళ్ల వరకు మరో భాగంగా విస్తరించి పనులు చేపట్టేలా కార్యాచరణ రూపొందించారు. గతంతో విస్తరించి ఉన్న రెండు వరుసల మార్గాన్ని నాలుగు వరుసలుగా పెంచే పనులు అత్యధికశాతం పూర్తి చేశారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా పర్చూరు వై జంక్షన్ వద్ద, అన్నంబొట్లవారిపాలెం సమీపంలో, కారంచేడు- పర్చూరు మార్గంలో ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డును చదును చేసే పనులు సాగుతున్నాయి. పర్చూరు వాగుపై ఫ్లైవోవర్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఉప్పుటూరు సమీపంలో పనులు జరుగుతున్నాయి. రెండేళ్లలో ఈ రహదారి పనులు పూర్తి అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణంతో తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రయాణం సులభతరం కానుంది.



కుంకలమర్రు రోడ్డులో కొమ్మమూరు కాలువ మీదుగా రహదారి నిర్మాణానికి చేపడుతున్న పనులు



అన్నంబొట్లవారిపాలెం సమీపంలోని ఈపూరివారిపాలెం వద్ద చేస్తున్న రహదారి నిర్మాణం

మద్యం.. డోర్ డెలివరీ

- క్వార్టర్‌కు రూ.50 అదనంగా వసూలు
- బెల్ట్ దుకాణాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు



మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్న వ్యాపారి

మేదరమెట్ల, మే 18: రూ.50 అదనంగా చెల్లిస్తే చాలు.. ఎప్పుడు కావా లంటే అప్పుడు.. ఎక్కడికి కావాలంటే అక్కడికి.. ఏ సమయంలోనైనా మద్యం అందుతుంది. మందుబాబుల సేవకు బెల్టు షాపుల నిర్వాహకులు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిబంధనల మేరకు విక్రయాలు జరగాలి. కానీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో మామూళ్లకు అలవాటు పడిన సిబ్బంది ఇష్టారీతిన మద్యం అమ్మకాలు చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా క్వార్టర్ బాటిల్‌కు రూ.10 అదనంగా చెల్లించి రాజకీయ నాయకులు పెద్దసంఖ్యలో మద్యం తరలించారు. ఇలా మద్యం దుకాణాల్లో పని చేసే వారు రూ.3 నుంచి 4 లక్షలకు వరకు సంపాదించినట్లు సమాచారం. శనివారం మేదరమెట్లలో తమ్మవరం రోడ్డులోని మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి ఒకేసారి పది బాటిళ్ల మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. దుకాణం వద్ద సీసీ కెమెరాలు ఉన్నా, స్థానికులు ఇదంతా వీడియోలు తీసినా అటు దుకాణంలోని సిబ్బంది కాని, ఇటు ఆ వ్యక్తి కానీ భయపడలేదంటే వారెంతకు బరితెగించారో అర్థమవుతుంది. అనధికారికంగా బార్లు నడిపే వారు కూడా మద్యం దుకాణాల్లోని సిబ్బందిని ప్రసన్నం చేసుకుని మద్యం తీసుకెళ్లి అదనపు మొత్తాలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. అనాధికారికంగా బార్లు నిర్వహించేవారికి మద్యం మీదనే రోజుకు రూ.5 వేల ఆదాయం వస్తుందంటే ఎంత మొత్తంలో వీరు మద్యం తీసుకువెళ్తున్నారో అర్థంచేసుకోవచ్చు. ప్రతి గ్రామంలో పదికి పైగా బెల్టు షాపులు ఉన్నాయి. మేదరమెట్ల లాంటి మేజర్ పంచాయతీలో 30 మందికి పైగా మద్యం విక్రయిస్తున్నారు అంటే షాపుల నుంచి ఎంత పెద్ద మొత్తంలో మద్యం బయటకు వెళ్తుందో తెలుసుకోవచ్చు. వీరు కాకుండా రాత్రి 9 గంటల తర్వాత మోటర్ సైకిళ్లపై తిరుగుతూ అడిగిన వారికి ఎక్కడికైనా మద్యం సరఫరా చేసే వారు ఇటీవల ఎక్కువయ్యారు. బెల్టు షాపులు నిర్వహించే వారు ఒక్క మద్యం పైనే రోజుకు వెయ్యి సంపాదిస్తున్నారని తెలిసింది. మేదరమెట్లలో ఓ షాపులో కేసు మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్తున్న ఓ ఇటీవల అధికారులు పట్టుకున్నారు. దీంతో ఆ సూపర్‌వైజర్ ఎస్ఈబీ అధికారులకు రూ.2 లక్షలు చెల్లించి కేసు లేకుండా చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మేదరమెట్లలో తెలంగాణ మద్యం పెద్ద మొత్తంలో పట్టుకున్న అధికారులు 4 బాటిళ్లు మాత్రమే చూపి ఆ వ్యక్తి నుంచి మద్యంతో పాటు లక్ష తీసుకున్నారని తెలిసింది. ఇప్పటికైనా ఎస్ఈబీ, ఎక్సైజ్ అధికారులు షాపుల్లో పని చేసే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటే అనాధికారిక బార్లు, బెల్టు షాపులు పెరిగిపోయే అవకాశం ఉంది.

హిట్ లిస్ట్‌లో ఏముంది?



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కార్తికేయన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను తమిళ హీరో సూర్య శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం ప్రేక్షకులు క్రైమ్, సస్పెన్స్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారనీ, అదే జానర్‌లో వస్తున్న ఈ సినిమా కూడా అందరినీ అలరిస్తుందనీ నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. శరత్‌కుమార్, సముద్రఖని, గౌతమ్ వాసుదేవ మీనన్, సితార తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా ఫ్రిక్స్, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.

క్యూట్‌గా స్వీట్‌గా



చైతన్యారావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'క్యూట్‌గా స్వీట్‌గా' అంటూ సాగే గీతాన్ని హీరో అడివిశేష్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. కిట్టూ విస్సాప్రగడ్ సాహిత్యం అందించగా, దీపు ఆలపించారు. కల్యాణి మాలిక్ స్వరాలు సమకూర్చారు. 'క్యూట్‌గా స్వీట్‌గా పాట సాహిత్యం బావుంది. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం ఘన విజయం సాధించాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ అని దర్శకుడు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

సినిమావాళ్ల కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్ ప్రధాన తారాగణంగా హరీష్ చావా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. నేరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. సినీరంగంలో రాణించాలనే తపనతో నలుగురు స్నేహితులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుందని దర్శకుడు తెలిపారు. ప్రతి సినిమా వ్యక్తి, ఇది తన కథే అని ఫీలయ్యేలా ఉంటుందని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మీరావలి.

సిద్ధార్థ్ 40వ చిత్రం



తెలుగు, తమిళ భాషల్లో మంచి నటుడుగా గుర్తింపు పొందిన సిద్దార్థ్ తన తాజా చిత్రం వివరాలు వెల్లడించారు. ఇది ఆయనకు 40వ చిత్రం కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి శ్రీగణేశ్ దర్శకత్వం వహించనున్నారు. అరుణ్ విశ్వ నిర్మాత. ఈ సినిమా గురించి సిద్ధార్థ్ మాట్లాడుతూ 'ఈ మధ్య నేను చాలా కథలు విన్నా. శ్రీగణేశ్ చెప్పిన కథ బాగా నచ్చింది. మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. 'నేను స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నప్పుడు యూత్‌తో పాటు పరిణితి కలిగిన నటుడు కావాలనుకున్నాను. అప్పుడే సిద్దార్థ్ గుర్తుకు వచ్చారు. ఆయన కథ విని మెచ్చుకుని, కొన్ని సూచనలు కూడా ఇచ్చారు' అని దర్శకుడు గణేశ్ చెప్పారు. 'శాంతి టాకీస్ అని మా అమ్మ పేరు బేనరుకు పెట్టాం. ఆవిడ థియేటర్‌లో చూసి ఆనందించే సినిమాలే తీస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కమర్షియల్ చిత్రాలు తీస్తాను. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత అరుణ్ విశ్వ చెప్పారు.

అనంతపురం అమ్మాయి ప్రేమకథ



అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి నిర్మాతగా, కథారచయిత్రిగా, హీరోయిన్‌గా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ ఈ సినిమాకు దర్శకుడు. సుమయా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, 'నీవెవ్వరో' పాట విడుదల చేశారు. మెలోడీ ట్యూన్‌తో ఈ పాట ఆకట్టుకుంటోంది. నిర్మాతగా తనకు ఇదే తొలి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీస్థాయిలో ఈ ప్రేమకథను నిర్మించారు సుమయా రెడ్డి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.



రొమాంటిక్ సిల్క్ శారీ

వాసుదేవ్‌రావు, రీనా చౌదరి, ప్రీతీ గోస్వామి హీరోహీరోయిన్లుగా నటించిన 'సిల్క్ శారీ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మురళీమోహన్, శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రమలేష్ కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. మా బేనరుపై వరుసగా చిత్రాలు నిర్మిస్తాం' అని చెప్పారు. దర్శకుడు టి.నాగేందర్ మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. హీరో వాసుదేవ్‌రావు కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అని చెప్పారు.

మ్యూజికల్ జర్నీ



ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ తదితరులు నటించిన మ్యూజికల్, ఫీల్‌గుడ్ ఫిల్మ్ 'నీ దారే నా కథ'. వంశీ జొన్నలగడ్డ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ తేజేశ్ వీర, శైలజ జొన్నలగడ్డతో కలసి నిర్మించారు. జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇది మ్యూజికల్ బేస్డ్ ఫిల్మ్. స్నేహం, కలలు సాధించాలనే సంకల్పం, తండ్రీకొడుకుల బంధం.. వంటి అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్ కోస్టర్‌లా ఫీల్ అవుతారు. సంగీతం స్వరాన్ని సెట్ చేస్తుంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో ఓ మధురమైన ప్రయాణంలా చిత్రం ఉంటుంది' అని శివ జొన్నలగడ్డ చెప్పారు. ఈ చిత్రానికి రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం: ఆల్బర్టో గురియోలి, సినిమాటోగ్రాఫర్: ఎలెక్స్ కావు.

శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ



చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్.

అర్హత: సీఎస్‌ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్‌ఈ/ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్టులు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎస్సీలో బీటెక్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

ఎంపిక: 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/

ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు



సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు

- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

అర్హత: బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్-జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VTVnpuoలో చదవండి.

తెలంగాణ ఈఏపీసెట్‌లో భాష్యం విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎం.సాయియశ్వంత్‌రెడ్డి, ఎం జిష్ణుసాయి, కె హర్షిత కె మనీష్ చౌదరి, కె ప్రభాస్

గుంటూరు(విద్య), మే 18: తెలంగాణ ఈఏపీ సెట్‌లో భాష్యం విద్యా సంస్థలు 100 లోపు 12 ర్యాంకులు సాధించి మరో సారి సత్తాచాటాయని సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌ఈ ఏపీసెట్‌లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 11, కె.హర్షిత 13, కె.మనీష్‌చౌదరి 28, కె.ప్రభాస్ 31, టి.మునికార్తీక్ 58, పి.శ్యామ్ 63, ఎం.సాయిజశ్వంత్‌రెడ్డి 65, ఎ.గణేష్ దత్తా 93, ఎం.శ్రీచరిత సాయి 94, డి.పూజ 97, కె.ఆర్.ఎస్.వి. సుమన్విత 100వ ర్యాంకు సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు 100లోపు 12 ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారన్నారు. భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులకు చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అభినందనలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన యరపతినేని



పిడుగురాళ్ల, మే 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడ్ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని అలాగే గురజాలలో మంచి మెజార్టీతో గెలుపొందుతానని ఆయన చంద్రబాబుకు వివరించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేశారన్నారు. ఎన్నికల రోజున ఈవీఎంలను ధ్వంసం చేయడానికి వైసీపీ నాయకులు చేసిన అనేక ప్రయత్నాలను, టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతలు జరిపిన దాడులను ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని ప్రాంతాల్లో సమర్థంగా ఎదుర్కొన్న విషయాన్ని కూడా వివరించారు.

తాడికొండదే.. తొలి ఫలితం

- ఈ నియోజకవర్గం నుంచి బరిలో కేవలం 10 మంది అభ్యర్థులే
- పోలింగ్ బూత్‌లు కూడా 244 మాత్రమే
- మిగతా నియోజకవర్గాలతో పోల్చితే ఓటర్ల సంఖ్య తక్కువే

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు తేదీ దగ్గర పడుతుండటంతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది. అటు అభ్యర్థులు, ఇటు ఓటు వేసిన ప్రజల్లోనూ ఒకటే పరిస్థితి. తాము గెలవాలని అభ్యర్థులు, ఓటేసిన అభ్యర్థి గెలవాలని ఓటర్లు నిత్యం జూన్ 4వ తేదీ కోసం రోజులు లెక్కిస్తున్నారు. క్షణం ఒక యుగంలా గడుపుతున్నారు. కాగా జిల్లాలో ఎన్నికలు జరిగిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ స్థానంలో అన్నింటి కంటే తొలుత ఫలితం వెలువడేది అమరావతి రాజధాని ప్రాంతం కలిగిన తాడికొండ నియోజకవర్గమే. ఇందుకు ప్రధాన కారణం ఈ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటం, పోటీలో నిలిచిన అభ్యర్థులు కూడా పది మందే కావడం, పోలింగ్ బూత్‌ల సంఖ్య కూడా తక్కువ తదితర కారణాలతో తాడికొండ ఫలితం తొలుత వెలువడుతుందని అధికారవర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాడికొండలోనే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. ఇక్కడ ఓటర్ల సంఖ్య 2 లక్షల 7 వేల 615గా ఉన్నది. ఈ నేపథ్యంలో తక్కువ పోలింగ్ బూత్‌లు అవసరమయ్యాయి. మిగతా నియోజకవర్గాల్లో 255కి పైగా పోలింగ్ బూత్‌లు ఉంటే తాడికొండలో 244 మాత్రమే ఉన్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలతో పోల్చితే ఒక రౌండ్ ముందుగానే ఓట్ల లెక్కింపు పూర్తి అయి ఫలితం వెలువడుతుంది. పైగా ఇక్కడ అభ్యర్థులు కేవలం 10 మందే కావడం వలన ఈవీఎంలో ఓట్ల లెక్కింపునకు కూడా తక్కువ సమయం తీసుకొంటుంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా 14 టేబుల్స్‌ని కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేస్తారు. అలానే రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమాంతరంగా జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో రాజధానిలో ఏ పార్టీ అభ్యర్థి జెండా ఎగుర వేస్తారనేది తొలుత తేలిపోతుంది. పోలింగ్ బూత్‌లు ఎక్కువ సంఖ్యలో ఉన్న మంగళగిరి, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు మిగతా వాటి కంటే ఆలస్యమౌతాయి. ముఖ్యంగా మంగళగిరిలో 300 పోలింగ్ బూత్‌లున్నాయి. అంతేకాకుండా ఇక్కడి నుంచి 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీని వలన ఒక్కో ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తి చేయడానికి ఎక్కువ సమయం తీసుకొంటుంది. ఆ తర్వాత గుంటూరు పశ్చిమలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంటుంది. ఈ నియోజకవర్గంలో 291 పోలింగ్ బూత్‌లు, 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీని వలన పశ్చిమ ఫలితం కూడా ఆఖరునే వస్తుంది. ప్రత్తిపాడులో అభ్యర్థుల సంఖ్య 13 తక్కువైనప్పటికీ 288 పోలింగ్ బూత్‌లున్నాయి. దీంతో మంగళగిరి, పశ్చిమ కంటే ఈ నియోజకవర్గం ఫలితం ముందుగా వస్తుంది.

కోర్టు ఆదేశాలు.. బేఖాతరు

- అధికారులు ఎన్నికల విధుల్లో
- కొనసాగుతున్న ఆక్రమణల జోరు..



పిడుగురాళ్ల చెరువు స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం, వాగు పోరంబోకు స్థలంలో నిర్మాణం చేపట్టిన కమర్షియల్ కాంప్లెక్స్

పిడుగురాళ్ల, మే 18: చెరువు భూముల్లో.. వాగు పోరంబోకుల్లో నిర్మాణాలు చేపట్టవద్దని, ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా పిడుగురాళ్ల, పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న భూముల్లో అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు స్థలాలను ఆక్రమించుకోగా మరికొందరు ఏకంగా గృహాలను నిర్మించారు. ఆదేమిటని అడిగే అధికారులు లేకపోవటంతో ఆక్రమణదారులు రెచ్చిపోయి వేరే సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ పొంది గృహాలను నిర్మించేశారు. పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్, గృహ నిర్మాణపు విభాగ అధికారులు అటు వైపు వెళ్లి అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న గృహాలను అడ్డుకోవటంలో వెనుకంజ వేశారు. ధైర్యం చేసి మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు చెరువు భూములలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్న కట్టడాల వివరాల నివేదికను తయారు చేశారు. ఈలోగా నియోజకవర్గ ముఖ్యనేత ఆక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాల జోలికి వెళ్లవద్దని వారంతా పేదవారేనని అక్రమ నిర్మాణదారులకు వత్తాసుపలికారు. గత రెండు నెలలుగా అధికార యంత్రాగం మొత్తం ఎన్నికల విధుల్లో ఉండగా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతూనే ఉంది. ఖాళీ జాగా కన్పిస్తే చాలు తెల్లవారేసరికే పునాదులు వేసేస్తున్నారు. మరో వేరే సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్ పొందిన గృహాలు మరోకరి పేరుతో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా అద్దంకి- నార్కెట్‌పల్లి రోడ్డుకు సమీపంలో ఉన్న వాగు పోరంబోకు స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న స్పందించిన అధికారి లేరని చెప్పవచ్చు. పిడుగురాళ్లలో ఆక్రమ నిర్మాణాలు, పరిసరా ప్రాంతాలలో పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న అనధికార ప్లాట్ల నిర్వాహకుల నుండి పెద్దఎత్తున నగదు చేతులు మరటం వలనే సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లీజుకు 'కర్మ' భూమి?



కోడ్ అమల్లో ఉండగా.. కిరికిరి నిర్ణయాలు!

బాపట్ల తూర్పుసత్రం భూమిలో కొంత భాగం ఐవోసీకి

రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయమన్న దేవదాయశాఖ అధికారులు

బాపట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కర్మకాండల కోసం దశాబ్దాల క్రితం పేరం గురుడాచల నాయుడు అనే వ్యక్తి బాపట్ల పరిసరప్రాంతాల్లో 92 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చారు. అందులో కొంత భాగంలో బాపట్ల పట్టణ నడిబొడ్డున తూర్పు సత్రం పేరిట ఓ భవనాన్ని నిర్మించి కర్మకాండలకు ఉపయోగిస్తున్నారు. అక్కడే ఖాళీగా ఉన్న స్థలంపై గతంలోనే పాలకపార్టీ నేతల కన్ను పడింది. 216 ఏ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు గుంభనంగా అతితక్కువకు లీజుకు ఇచ్చిన అంశం 2022 నవంబరులో వెలుగుచూసింది. ఈ లీజు అంశాన్ని కాపు సంఘాలతో పాటు టీడీపీ, జనసేన పార్టీలు సైతం అప్పట్లో వ్యతిరేకించాయి. తాజాగా అదే స్థలంలో 78 సెంట్లు ఐవోసీ(ఇండియన్ ఆయిల్ కంపెనీ)కి పెట్రోల్ బంకు కోసం లీజుకివ్వడం అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నెల వ్యవధిలోనే ఇదంతా జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

గడచిన నెల 1న లెటర్...

బాపట్ల పట్టణ నడిబొడ్డులో ఉన్న పేరం గరుడాచల నాయుడు సత్రం(తూర్పు సత్రం) రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న భూమిని పెట్రోలు బంకు కోసం లీజుకు ఇవ్వాలని ఏప్రిల్ 1న ఐవోసీ ప్రతినిధులు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌ను ఆశ్రయించినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత సీఎస్ స్థాయిలో నిర్ణయం జరిగి ఈ నెల 7న లీజుకు సంబంధించి ఆర్డర్ ఉత్తర్వులను జిల్లా అధికారులకు పంపించి అమలు చేయనున్నట్లు సమాచారం. 78 సెంట్ల భూమిని నెలకు 46 వేలకు లీజుకు ఐవోసీకి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం వ్యవహారం అంతా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జరగడం, అంతా కలిపి నెలలోనే లీజు అంశాన్ని ఒక కొలిక్కి తేవడం వెనక రాజకీయ ప్రమేయం పైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

గతంలోనూ ఒకసారి ఇలానే...

2022 నవంబరులో ఈ సత్రం భూమినే ఎలాంటి వేలం లేకుండా జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలను సైతం లెక్క చేయకుండా అధికార పార్టీ నేతలు చక్రం తిప్పడంతో నామమాత్రపు ధరకు లీజుకిచ్చారు. అనుమతులు రాకముందే అక్కడ స్థలాన్ని వాడుకోవడంతో అడుగడుగునా అధికార దుర్వినియోగం పాల్పడడంపై విమర్శలు వెల్లువెత్తాయి

సున్నితమైన అంశంలో ఏకపక్షంగా...

పేరం గరుడాచలంనాయుడు అనే వ్యక్తి బాపట్ల ప్రజల మేలు కోసం విరాళంగా ఇచ్చిన భూమి అది. దాని నిర్వహణ దేవాదాయశాఖే చూస్తున్నప్పటికీ అత్తసొమ్ము అల్లుడుదానం చేసిన చందాన సదరు భూమిని ఐవోసీకి లీజుకివ్వడంపై కాపు సంఘాలతో పాటు టీడీపీ, జనసేన పార్టీలు కూడా మండిపడుతున్నాయి. స్థలాన్ని లీజుకు ఇచ్చేటప్పుడు స్థానికంగా ఉండే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా నిబంధనల ప్రకారమే లీజుకు ఇచ్చామని ప్రభుత్వం చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది

ఆదరాబాదరాగా తీసుకోవాల్సిన అవసరమేమిటి...

బాపట్లలోని తూర్పు సత్రం భూముల విషయం గతంలోనూ వివాదస్పదమైంది. తాజాగా ఇప్పుడు ఐవోసికీ లీజుకివ్వాలనే నిర్ణయం తీసుకోవడంపై బాపట్లవాసులు మండిపడుతున్నారు. యంత్రాంగం ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై ఉన్న సమయంలో ఈ లీజు నిర్ణయం తీసుకోవడం ఒక ఎత్తయితే బాపట్లలో సత్రం భూములు ఖాళీగా ఉన్న విషయం సదరు కంపెనీ ప్రతినిధులకు తెలియడం, వెంటవెంటనే నిర్ణయాలు జరిగిపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పైగా జిల్లాకు సంబంధించిన దేవదాయ శాఖ యంత్రాంగాన్ని ఆ స్థలం విషయంలో కనీసం సంప్రదించకుండా రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకున్నామని చెప్పడం వెనుక రాజకీయ శక్తుల ప్రమేయం పనిచేసిందనే వ్యాఖ్యానాలు జోరుగా వినిపిస్తున్నాయి.

అమరావతి నిర్వీర్యంతో రాష్ట్ర ప్రజలకు నష్టం

- 1614వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 18: అమరావతి నిర్వీర్యం రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగించిందని రాజధాని రైతులు తెలిపారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు శిబిరాలు ఇళ్ల వద్ద చేస్తు న్న ఆందోళనలు, దీక్షలు శనివారం నాటికి 1614వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రాజధానులతో రాష్ట్రానికి ప్రయోజనం కలగదని తెలిసి కూడా సీఎం జగన్‌రెడ్డి దానిని పట్టుకుని వేలాడుతున్నారన్నారు. ఐదేళ్లలో ఓ ఒక్క అభివృద్ధి చేయని జగన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఓడిపోయి ఇంటికి వెళ్లటం ఖాయమన్నారు. చంద్రబాబు సీఎం అవుతారు.. రైతు రాజ్యం రాబోతుందన్నారు. అమరావతిని అభివృద్ధి చేయమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పినా జగన్‌రెడ్డి పట్టించుకోకపోవటం నియంత పాలనకు నిదర్శనమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నిఘా నీడన..

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచల భద్రత
- సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
- పరిశీలించిన ఇంఛార్జ్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నరసరావుపేట, మే 18: పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరచిన జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాలను శనివారం జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అదనపు ఎస్పీ ఆర్ రాఘవేంద్ర ఆకస్మికంగా తనిఖీలు చేసి, భద్రతాపరమైన అంశాలలో సిబ్బందికి తగిన సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూంలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించామని శ్యామ్ ప్రసాద్ తెలిపారు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా విషయంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షిత అంశాలపై అదనపు ఎస్పీతో కలిసి కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాకు చెందిన 7 అసెంబ్లీ, 1 పార్లమెంటు నియోజవర్గాలకు సంబంధించి పోలింగ్ అయిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో ఆయా ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక సంఘటనలపై అదనపు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ హింసకు సంబంధించిన ఏదైనా సంఘటనకు స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా, సంయమనం పాటించడం అత్యంత కీలకమన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగిన సందర్భంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. అదే విధంగా జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూము వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లో వద్ద అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు ఎవరు సదరు కాలేజీ చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు.

పిడుగుపడి రైతు మృతి

ఈపూరు, మే 18: పిడుగుపడి రైతు మృతి చెందిన సంఘటన ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కర్రి హనుమంతు రావు(40) పశువులను మేత కోసం పొలం తోలుకు వెళ్ళాడు. సాయం త్రం ఉరుములు, మెరుపులుతో వర్షం వస్తుండడంతో దగ్గరలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోకి వెళ్తుండగా పిడుగుపడింది. దీంతో ఆయన కిందపడి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తీరంలో సందడి

బాపట్ల, మే 18: సూర్యలంక సముద్రతీరానికి శనివారం యాత్రీకులు పెద్దసంఖ్యలో వచ్చారు. సముద్ర స్నానాలు చేస్తూ, ఆటలాడుతూ సందడి చేశారు. వేసవి సెలవులు కావటంతో విద్యాసంస్థలు మూసివేయటంతో విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా తీరానికి వచ్చి సముద్రస్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు.

హ్యాండ్‌లూమ్ డిప్లొమా ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), మే 18: శ్రీప్రగడకోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతి ఆధ్వర్యంలో పలు డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని సదరు విద్యా సంస్థనందు 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గదలో నాలుగు సీట్లకు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ సహాయసంచాకులు వి.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులని తెలిపారు. ఇతర వివరాల కోసం www.iihtvgr.com వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

గ్రూపు 2 మెయిన్ పరీక్షకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), మే 18: ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించి మెయిన్ పరీక్షలకు సిద్ధం అయ్యే అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంచాలకులు డి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0863- 2358071 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి మొదటి విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు ఎస్ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను జూన్ 10లోగా పంపాలని సూచించారు. జూన్ 10లోగా గుంటూరు లేదా తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00



బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన అధికారులు

బాపట్ల, మే 18 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్‌జిందాల్‌లు శనివారం సందర్శించారు. పోలీసుసిబ్బంది ఏర్పాటు చేసిన బందోబస్తును పరిశీలించి సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అక్కడ ఏర్పాటు చేసిన బందోబస్తు గురించి వివరించారు. ఎప్పటికప్పుడు బందోబస్తును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. సందర్శనకు వచ్చే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలని ఆదేశించారు. కౌంటింగ్ ఏర్పాట్లకు పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు నిబంధనలు ఖచ్చితంగా అనుసరించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టంగా ఏర్పాటు చేసిన మూడుఅంచల భద్రతలో విధులు నిర్వహించే కేంద్ర సాయుధబలగాలు, అర్మ్‌డ్ రిజర్వు, సివిల్ పోలీసు బలగాలు 24 గంటలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో సీహెచ్ సత్తిబాబు, డీఎస్పీ టి.మురళీ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



సప్లమెంటరీ పరీక్షలపై విద్యాశాఖాధికారులతో సమీక్షిస్తున్న జిల్లా రెవెన్యూఅధికారి సత్తిబాబు

సప్లమెంటరీ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

- జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

బాపట్ల, మే 18 : జిల్లాలో ఈనెల 24వ తేదీ నుంచి జరగబోయే ఇంటర్మీడియట్, 10వ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను ఎటువంటి లోపాలకు తావులేకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తెలిపారు. డీఆర్‌వో ఛాంబర్‌లో శనివారం ఈ విషయమై విద్యాశాఖాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో డీఈవో నారాయణరావు మాట్లాడుతూ 24వ తేదీ నుంచి జూన్ 3వ తేది వరకు 10వ తరగతి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 11 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 7,384 మంది విద్యార్థులు 10వ తరగతి సప్లమెంటరీ పరీక్షలకు హాజరవుతారన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో 21 పరీక్షా కేంద్రాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయన్నారు. మొత్తం 9,579 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఎర్రయ్య వివరించారు. డీఆర్‌వో సత్తిబాబు మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. అదేవిధంగా అంతరాయం లేని నిరంతర విద్యుత్ ప్రసారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పరిశుభ్ర వాతావరణం, తాగునీటి సౌకర్యం కల్పించాలని, ఫస్ట్‌ఎయిడ్ మెడికల్ కిట్‌లను అందుబాటులో ఉంచాలని సంబంధితాకాధికారులకు సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ బగళాముఖి అమ్మవారి బంగారు ఆభరణాల శోభయాత్ర



బంగారు ఆభరణాల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న శ్రీబగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, మే 18 : మండల పరిధిలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి శతజయంతి తిరునాళ్ళ మహోత్సవాలు సందర్భంగా శ్రీబగళాముఖి అమ్మవారికి చెందిన బంగారు ఆభరణాల శోభయాత్ర శనివారం ఉదయం 9.30 నుంచి వివిధ వాయిద్యాలు, వేద మంత్రాలతో ఆలయం నుంచి ప్రారంభమై స్థానిక స్టేట్‌బ్యాంక్ వరకు కొనసాగింది. బ్యాంక్, వివిధ శాఖల అధికారుల సమక్షంలో ఆభరణాల షీల్డ్‌బాక్స్ స్వీకరించి ఆలయం వరకు తీసుకొచ్చి అమ్మవారి సన్నిధిలో జాయింట్ కలెక్టర్ శ్రీధర్, బాపట్ల డీఎస్పీ టి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.స్ఫూర్తి, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు, చందోలు ఎస్సై టి.అనీల్, పొన్నూరు ఎఫ్‌వోకు చెందిన టి.శ్రీనివాస్, చందోలు వీఆర్వోలు పి.అమానుల్లాఖాన్, ప్రసన్న, చందోలు గ్రామసచివాలయ కార్యదర్శులు శేషగిరిరావు, వీరేంద్రబాబుల ఆధ్వర్యంలో ఆలయానికి తీసుకొచ్చారు. సాక్షులుగా భవనం బసివిరెడ్డి, దోమా నాగేశ్వరరెడ్డి, అలపాటి వెంకటరమణరావు, పేదరాజ పట్టాభి రామారావుల సమక్షంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి అభరణాల బాక్స్ ఓపెన్ చేసి శ్రీబగళాముఖి అమ్మవారికి అలంకరణ చేశారు. భక్తులకు దర్శనం సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలు నుంచి పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు మోదుగుల ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. ఆలయ సీనియర్ సహాయకులు కొండవీటి శ్రీనివాసరావు ఆలయ, భక్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆభరణాలను శోభయాత్రగా తీసుకొస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి, పాలకమండలి అధ్యక్షుడు మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు

కలెక్టర్‌ను సన్మానించిన రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

బాపట్ల, మే 18 : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను సమర్ధవంతంగా, ప్రశాంతంగా నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాను బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించి సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సభ్యులు తడికమల్ల శ్రీనివాసరావు, డీవీ.రమణబాబు, జూలగంటి సత్యనారాయణరాజు, దిలీప్ అయ్యప్ప, గుంటూరు రామ సుబ్బారావు, పానకాల రాయుడు, ఎ.పరిశుద్ధరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి అభినందించారు. వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సేవలను అభినందించారు.



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషాను సన్మానిస్తున్న బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, సభ్యులు

భారీ వర్షం.. పారిశుధ్యం అధ్వానం

- రోడ్లపై నిలిచిన నీరు
- గాలివానకు నేలవాలిన బెలూన్ థియేటర్



చింతావారిపాలెం దగ్గర గాలివానకు నేలవాలిన బెలూన్ థియేటర్

బాపట్ల,మే 18 : గత మూడురోజులుగా కురుస్తున్న వర్షంతో జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గాలేక రోడ్లపై నీరు కాల్వలా ప్రవహిస్తున్నది. అధికారుల నిర్లక్ష్యం, పాలకులు పట్టించుకోకపోవటం వల్ల డ్రైనేజీలు కన్న రోడ్లు పల్లంగా ఉండటం వల్ల రోడ్లపై నిలిచిన నీరు డ్రైనేజీలలోకి వెళ్ళటం లేదు. పైగా డ్రైనేజీలలో నిలిచి ఉన్న మురుగు వర్షంతో పొంగి రోడ్లపైకి వస్తున్నది. దీనివల్ల వర్షపునీటికి మురుగుతోడై సిమెంట్‌రోడ్లు సైతం చిత్తడిగా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. అయినప్పటికి మున్సిపాల్ అధికారులు శానిటేషన్ పనులు నిర్వహించటంలేదు. ఎక్కడ అంటువ్యాధులు వ్యాపిస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎల్‌ఐసీ కార్యాలయానికి వెళ్ళే ప్రధాన రోడ్డుపై వర్షపునీరుకు మురుగుతోడై అధ్వానంగా మారింది. మార్కెట్‌కు, ఎల్‌ఐసీ కార్యాలయానికి వెళ్ళే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీకాలనీలో డ్రైనేజీలు ఉన్నప్పటికి డ్రైనేజీలు ఏర్పాటు చేసినా నీరు వెళ్ళే పరిస్థితి కనిపించటంలేదు. అదేవిధంగా ఉప్పరపాలెం రైల్వేగేటు నుంచి మూలపాలెం వెళ్ళే ప్రధాన రహదారికి ఇరువైపుల వర్షపునీరు, మురుగు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్నివిధాలుగా ప్రతిసారి ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పటికి పాలకులు పట్టించుకోకపోవటం, అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవటం ప్రజలపాలిట శాపంగా మారింది. దుర్గంధ పూరితమైన ఈ ప్రాంతాలలో పందులు స్వైరవిహారం చేయటం కూడా పరిపాటిగా మారింది. దీనివల్ల విషజ్వరాలు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పేరుకే జిల్లా కేంద్రంగా ఉంది తప్ప ఉన్న శానిటేషన్ సిబ్బంది మొత్తం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ శుభ్రం చేయటం, ప్రధాన రహదారులలో శానిటేషన్ పనులు నిర్వహించటానికే సరిపోతున్నారు. అదనపు సిబ్బందిని నియమించరు, మురికివాడలను అభివృద్ధి చేయరు, డ్రైనేజీలను ఆధునీకరించరు. దీనివల్ల నిత్యం సమస్యలతో ప్రజలు సతమతమౌతూనే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇదిలాఉండగా సూర్యలంక రోడ్డులోని చింతావారిపాలెం దగ్గర ఏర్పాటు చేసిన బెలూన్ థియేటర్ శనివారం తెల్లవారుజామున కురిసిన గాలివానకు నేలవాలింది. నిర్వాహకులు దానిని మరలా పునరుద్దరించారు. కొద్దిపాటి వర్షాలకే ప్రజలు ఇబ్బందులు పడుతుంటే విపత్తుల సమయంలో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితియేమిటని ప్రశ్నిస్తున్నారు?



ఎల్‌ఐసీ కార్యాలయానికి వెళ్ళే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



బాపట్ల కొత్తబస్టాండ్ దగ్గర హైవేరోడ్డుపై నిలిచిన వర్షపునీరు

ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురికావటం వల్ల రోడ్లపైనే నీరు నిలబడిపోతున్నది. 21వవార్డు పాపినేని వారి వీధిలో సీసీ రోడ్డుపై నీరు నిలిచి బయటకెళ్ళే పరిస్థితి కనిపించటంలేదు.

బాపట్ల కొత్తబస్టాండ్ కూడలిలో కర్లపాలెం నుంచి బాపట్ల వచ్చే హైవే రోడ్డుపక్కన వర్షం నీరు నిలిచింది. నూతనంగా రోడ్డు నిర్మించి

కర్లపాలెంలో...

కర్లపాలెం, మే 18 : కర్లపాలెం మండలంలో శనివారం వేకువజామున కురిసిన వర్షం 6.4 సెంటీమీటర్లుగా నమోదైందని కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కర్లపాలెం మండలంలో తెల్లవారుజామున ఉరుముల మెరుపులతో ఏకదాటిగా వర్షం కురిసింది. చిన్న గాలులతో బీభత్సం సృష్టించింది. ఈ వర్షం కారణంగా కర్లపాలెంలోని శంకరం బావి ప్రాంతంలో సిమెంట్ రోడ్లపై మోకాళ్ళ లోతు వర్షపునీరునిలిచాయి. అదేవిధంగా కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎం.వి.రాజుపాలెం రహదార్లు, కర్లపాలెం-గణపవరం రహదారి, కర్లపాలెంసెంటర్‌లోని రహదార్లు చిత్తడి చిత్తడి మారాయి. అధికార యంత్రాంగం మండలంలో నూతన రహదార్లు నిర్మాణం చేయాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.



బాపట్ల పట్టణంలోని పాపినేని వారి వీధిలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు



కర్లపాలెం శంకరంబావి రోడ్డులో సిమెంట్ రోడ్డుపైన నిలిచిన వర్షపునీరు

దైవదర్శనానికి వెళ్ళి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- ఏడుగురికి గాయాలు

పిట్టలవానిపాలెం, మే 18 : మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని కప్పలవారిపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు బ్రహ్మంగారి మఠం, ఒంటిమిట్ట రామాలయానికి వెళ్ళి దైవదర్శనం చేసుకొని తిరిగి స్వస్థలానికి వస్తుండగా నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం టపాతోపు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కప్పలవారిపాలెం గ్రామానికి చెందిన అట్ల ఏడుకొండలు రెడ్డి, అన్నం కోదండరామిరెడ్డి, ఆసోది యల్లారెడ్డి, ఖాజీపాలెం గ్రామానికి చెందిన గుడివాడ దుర్గారావు, కప్పలశివారెడ్డి, అన్నం శ్రీనివాసరెడ్డి, కప్పల చిన్నారెడ్డి దైవదర్శనం చేసుకొని తిరిగి వస్తుండగా 45 నెంబరు జాతీయ రహదారిపై కొడవలూరు మండలం టపాతోపు సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టటంతో ఏడు మందికి తీవ్రగాయాలు కాగా క్షతగాత్రులకు మెడికల్ స్టూడెంట్ సుకన్య ప్రాథమిక చికిత్స అందించి 108 ప్రభుత్వ వాహనంలో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. మొత్తం 27 మంది దైవదర్శనానికి వెళ్ళగా 20 మంది సురక్షితంగా వచ్చారు. కారు నడుపుతున్న డ్రైవర్, కారులో ఉన్న వారికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వారిని పరామర్శించటానికి వారి కుటుంబ సభ్యులు నెల్లూరు తరలివెళ్ళారు. ఖాజీపాలేనికి చెందిన గుడివాడ దుర్గారావు, కప్పలవారిపాలేనికి చెందిన ఆసోది యల్లారెడ్డి, అన్నం కోదండరామిరెడ్డి, అట్ల ఏడుకొండలు పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.

'తూర్పుసత్రం ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వం'

బాపట్ల, మే 18 : తూర్పుసత్రం ఆస్తులు అన్యాక్రాంతం కానివ్వమని వైసీపీ నాయకులు పేర్కొన్నారు. బాపట్ల పట్టణ నడిబొడ్డున దివంగత పేరంగరుడాచలం నాయుడు ఏర్పాటు చేసిన తూర్పుసత్రం భూమిని లీజుకిచ్చారనే విషయం బయటకు పొక్కటంతో వైసీపీ నాయకులు స్పందించారు. పేద ప్రజల కోసం వారి అవసరాల కోసం గరుడాచలం నాయుడు దానం చేసిన భూమిలో పురాణ కాలక్షేప మండపం ఏర్పాటుకు అనుమతులు పొందటం జరిగిందన్నారు. నూతన అపరకర్మలభవనం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిర్మాణం జరుగుతుందన్నారు. గరుడాచలం నాయుడు కీర్తి చాటేవిధంగా క్రీడాప్రాంగణం ఏర్పాటు చేసి ధర్మసత్రం కీర్తిని, ఆర్థిక పరిపుష్టిని ఇనుమడింప చేసేవిధంగా చేయాలని కొంతమంది వ్యక్తులకు లేదా సంస్థలకు ప్రయోజనం చేకూర్చే చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. వైసీపీ నాయకులు ఇనుపగోళ్ళ రంగారావు, ఇనగలూరి మాల్యాద్రి, పీటా వెంకటేశ్వరరావు, వెంకట్రావు, పిన్నిబోయన ప్రసాద్, తాడి గిరి పాల్గొన్నారు.

78 సెంట్లు ఐఓసీకి లీజుకిచ్చాం : ఈవో

తూర్పుసత్రానికి సంబంధించిన భూమిలో 78 సెంట్లు నెలకు రూ.46 వేల చొప్పున ఐఓసీకి లీజుకిచ్చినట్లు ఈవో డి.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి మూడు సంవత్సరాలకు 30శాతం పెంపుదలతో ఇవ్వటం జరిగిందన్నారు. అయితే దీనిని సబ్ లీజుకివ్వటానికి లేదన్నారు. ఐవోసి (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్) వారు మాత్రమే నిర్వహించుకోవాలని పర్మినెంట్ స్ట్రక్చర్ నిర్మించరాదని జీవో ఎం.ఎస్ నెంబరు 426 ప్రకారం ఇచ్చారన్నారు. 11 సంవత్సరాల లీజు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

సుబ్బారావుకు ఘన నివాళులు

కొల్లూరు, మే 18 : ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం నేత ధూళిపాళ్ల సుబ్బారావు సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. మండల పరిధిలోని అనంతవరంలో సుబ్బారావు స్మారక స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రమాదేవి, సీపీఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వై.నేతాజీ, అమ్మ నేత్ర అవయవదానం ట్రస్ట్ అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం, సీపీఎం నాయకులు పి.నరసింహారావు, ఎన్.కోటేశ్వరరావు, టి.కృష్ణమోహన్, కె.నటరాజ్, బి.అగస్టీన్, టి.సురేష్, ఎం.సాంబిరెడ్డి, జి.సుధాకర్, వేములపల్లి వెంకటరామయ్య, జి.నాగరాజు, ధూళిపాళ్ల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

బాపట్ల, మే 18 : పట్టణంలోని ఉప్పరపాలెంలో ఉన్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. 15 సంవత్సరాలుగా ప్రతి ఏట నిర్వహించే ఉత్సవాలలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపి, ఊటుకూరి అంకమ్మరావు, పి.నాగేశ్వరరావు, గండికోట గోపి, నక్కా నాగేశ్వరరావు, తిరువీధుల శంకరప్రసాద్, గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

హనుమంత వాహనంపై కొలువుతీరిన భావదేవుడు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న భావదేవుడు

బాపట్ల, మే 18 : పట్టణంలో చారిత్రక ప్రసిద్దిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణస్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వారం స్వామివారు హనుమంత వాహనంపై కొలువుతీరారు. అర్చకస్వాములు శ్రీనివాసుల విఖనసమూర్తి, నల్లూరి విజయసారధి, నల్లూరి పాంచజన్యం, బృందావనం గోపిచంద్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారిని హనుమంత వాహనంపై నగరోత్సవం చేశారు.

టీడీపీ కార్యకర్తలకు ఆర్థిక సహాయం

అమృతలూరు, మే 18 : మండల కేంద్రం అమృతలూరుకు చెందిన ఇరువురు కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ నాయకుడు గొట్టిపాటి భానుగంగాధర్ ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కొల్లిపర నాగేంద్రంకు రూ.10 వేలు, పోతార్లంక వీరమల్లేశ్వరరావు రూ.5 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం అందించారు. ఆయన వెంట వార్డు సభ్యుడు బాజీ, చంద్రం, వీరగంధం శ్రీను, పోతురాజు ఉన్నారు.

పాస్టర్ శ్యామ్‌సుందరరావు మృతి



శ్యాంసుందరరావు(ఫైల్)

వేమూరు, మే 18 : వేమూరుకు చెందిన పాస్టర్ శ్యాంసుందరరావు (62)శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాస్టర్ శ్యాంసుందరరావు 35 సంవత్సరాలుగా వేమూరు పరిసర ప్రాంతాల్లో క్రైస్తవ సేవ చేస్తూ బేతులు ప్రార్థన మందిరం ఏర్పాటు చేసి దైవ సేవను అందిస్తున్నారు. పాస్టర్ శ్యాంసుందరరావు శుక్రవారం ప్రత్యేక ప్రార్థన సమావేశాల్లో పాల్గొని ప్రసంగిస్తూ అక్కడిక్కడే కుప్ప కూలిపోయారు. అక్కడి నుంచి వైద్యశాలకు తరలించే సమయంలో మార్గం మధ్యలో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పాస్టర్ శ్యామ్ మృతికి వేమూరు మండలం పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగుడీ సుధాకర్, పాస్టర్ యేసురాజు, పాస్టర్ నల్లమోతు ప్రభుదాస్, పాస్టర్ దాసరి ఏసుపాదం, పాస్టర్ యేనోస్, పాస్టర్ జే.హనాక్ తదితరులు ఉన్నారు. అదే విధంగా వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది పాస్టర్లు వచ్చి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



వాసవీమాత రథోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు, ఆర్యవైశ్య సంఘీయులు

కనుల పండువగా వాసవీమాత దివ్య రథోత్సవం



ప్రత్యేక అలంకారంలో వాసవీమాత

భట్టిప్రోలు, మే 18 : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకి జగన్మాత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. అమ్మవారి జయంతి ఉత్సవాలలో భాగంగా ముఖ్యఘట్టమైన దివ్య రథోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం జరిగిన రథోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగి వాసవిమాతను దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు. రథోత్సవం సందర్భంగా రథాన్ని రంగు రంగుల పూలు విద్యుత్ దీపాలతో అలంకరించి వాసవీమాతను రథంపై ప్రతిష్ఠించి రథానికి ఇరువైపులా ఉన్న మోకును చేతబూని ముందుకు కదులుతూ జై వాసవి జైజై వాసవి అంటూ నామస్మరణ గావించారు. రథోత్సవం ముందు భాగంలో పలు భజన బృందాల ఆధ్వర్యంలో మహిళలు, కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. అద్దేపల్లిలోని అమ్మవారి చెట్టు వద్దకు రథాన్ని తీసుకువెళ్ళి వాసవి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భారతరత్న దేవత బిరుదాంకితులు, శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామీజీ పర్యవేక్షణలో దేవస్థాన అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో అద్దేపల్లి భట్టిప్రోలు ఆర్యవైశ్య యువజన సంఘాలు, మహిళా సంఘాలు రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ రథోత్సవంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, ఆర్యవైశ్య సంఘీయులు తమ్మన రమేష్, మద్దుల చంద్రకిషోర్, కూరాళ్ళ రవికుమార్, మెంటా సాంబశివరావు, బూర్లె సుబ్బారావు, అలపాటి సురేంద్ర, కోట వెంకట నాగరాజన్, ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు, మే 18 : ఆర్యవైశ్య సంఘీయుల ఆధ్వర్యంలో శనివారం వేమూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కల్యాణ మండప నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కొమ్మూరి వెంకట రమణ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, అనంతరం అమ్మవారి వెండి ప్రతిమకు పంచామృత అభిషేకం జరిపారు. అనంతరం విశేష అలంకరణ చేసి 108 మంది యువతుల చేత కన్యకా పూజ జరిపించారు. పండిత వంశీకృష్ణ శర్మ వేద ఆశీర్వచనం చేశారు. ఆర్యవైశ్య మహిళలు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ, వాసవి అమ్మవారి స్తోత్ర పారాయణ చేశారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు, మాజీ ఎంపీపీ బొలిశెట్టి ప్రభాకరరావు, సంఘ అధ్యక్షులు నంబూరు గాంధీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





వేమూరులో విశేషాలంకరణలో వాసవి అమ్మవారు, లలితా సహస్రనామ పారాయణలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

కర్లపాలెంలో...

కర్లపాలెం, మే 18 : కర్లపాలెంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్య మహిళలు జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పూజారి పరమిపవన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కలశపూజ, మహిళలచే కుంకుమపూజలను ఘనంగా నిర్వహించారు. చీరాల వారిచే వాసవి కన్యకాపరమేశ్వరి గానామృత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కూనం గాయత్రి చేసిన భరతనాట్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీక్వీన్స్, అన్నదాన సమాజం, ఆర్యవైశ్య నాయకులు, పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు.





అలంకరణలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారు, కలశ పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

ఆలిండియా భగవద్గీత పోటీల్లో వేమూరు విద్యార్థి ప్రతిభ

- గోల్డ్‌మెడల్ సాధించిన శ్రీరామ్ బహుగుణ
- ప్రశంసా పత్రంతో అభినందించిన గణపతి సచ్చిదానంద స్వామిజీ



గణపతి సచ్చిదానంద స్వామిజీ చేతుల మీదుగా బంగారు పతకం ప్రశంసా పత్రం అందుకుంటున్న శ్రీరామ్ బహుగుణ

వేమూరు, మే 18 : శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామి దత్తపీఠం, మైసూరు వారి ఆధ్వర్యంలో ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన భగవద్గీత పోటీలలో వేమూరు గ్రామానికి చెందిన విద్యార్థి తన ప్రతిభను చూపి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యాడు. గ్రామానికి చెందిన చిరు వ్యాపారి పొట్టి శ్రీనివాస్, దేవి దంపతుల కుమారుడు శ్రీరామ్ బహుగుణ స్థానిక వివేకానంద విద్యా విహార్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. తల్లి దేవి చిన్ననాటి నుండి బహుగుణకు ఆధ్యాత్మిక బోధన చేయడం ద్వారా అతనిలో ధార్మిక భావం పెరిగింది. దీన్ని గ్రహించిన పాఠశాల ఉపాధ్యాయిని కలగా హేమలత బహుగుణకు భగవద్గీతలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. 800 శ్లోకాలు కంఠస్థం చేసిన బహుగుణ గణపతి సచ్చిదానంద స్వామిజీ ఆల్ ఇండియా స్థాయిలో ఏర్పాటు చేసిన భగవద్గీత పోటీలో పరీక్షల్లో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనగా 600 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వారిలో బహుగుణ ఉత్తమ శ్రేణి స్థాయిలో గుర్తింపు పొందారు. శుక్రవారం రాత్రి మైసూరు దత్త పీఠంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీగణపతి సచ్చిదానంద స్వామిజీ బహుగుణకు బంగారు పతకాన్ని ఇచ్చి ప్రశంసా పత్రంతో అభినందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వేమూరు గ్రామానికి చెందిన పెద్దలు వివేకానంద విద్యావిహార్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, పలువురు బంధుమిత్రులు బహుగుణకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అందని సంధికాలపు భత్యం

- గంగపుత్రుల గగ్గోలు
- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్ర వేట నిషేధం
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం


ఆగిన వేటతో.. వాడరేవు తీరంలో ఒడ్డున ఉన్న పడవలు

చీరాల, మే 18 : ప్రతి ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు సముద్రంలో వేట నిషేధం జరుగుతుంది. ఆ సమయంలో సముద్రంలో మత్స్య సంపద పునరుత్పత్తి జరిగుతుంది. ఆప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రభుత్వం వేటను నిషేధిస్తుంది. సముద్రంలో వేట నిషేధిత సమయాన్ని సంధికాలం అంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం రూ.10వేలు సంధికాలపు భత్యంగా వేట నిషేధం మొదలైన రోజునే అర్హులైన మత్స్యకారుల బ్యాంక్ ఖాతాలలో జమ చేయాలి. సముద్రంలో వేట నిషేధించి నెల దాటింది. అయినా నేటికి సంధికాలం భత్యం జమకాకపోవడంతో గంగపుత్రులు గగ్గోలు పెడుతున్నారు.

కడలిని నమ్ముకున్న కష్టజీవులు

సముద్రమే వారి ప్రపంచం. వేటే వారి జీవనాధారం. సముద్రంలో వేటాడిన మత్స్యసంపదను టోకుగా కొంత విక్రయించగా ఇంటి వద్ద మహిళలు రిటైల్‌గా ఆ సరుకును విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆ కుటుంబాలకు వేట జరిగితేనే భృతి. అయితే సముద్రంలో వేట నిషేధిత సమయంలో ప్రభుత్వపరంగా అందించే భత్యం రాకలే వారికి ఆదరవు.

ఎవరు లబ్ధిదారులు

సముద్రంలో వేటకు సంబంధించి మత్స్యశాఖ వద్ద బోట్లు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉండాలి. 21 సంవత్సరం నుంచి 60 సంవత్సరాలలోపు అర్హులైన వారిని లబ్ధిదారులుగా గుర్తిస్తారు. కుటుంబానికి ఒకరు మాత్రమే లబ్ధిదారుడు ఉంటాడు. అయితే కొందరు ఉమ్మడి కుటుంబాలవారు తమకు ప్రత్యేకంగా రేషన్ కార్డు లేనందున నష్టపోతున్నామని చెప్తున్నారు. ఆ క్రమంలో ఇటీవల కొందరు వేరుగా ఉంటున్నట్లు (స్ప్లిట్టింగ్) దరఖాస్తు చేసుకుని కొత్త రేషన్‌కార్డులు పొందారు. అలాంటి వారిని కూడా అర్హుల జాబితాలో చేర్చారు. ఇంకా పలువురు తమను అర్హుల జాబితాలో చేర్చాల్సి ఉందని చెప్తున్నారు.

ఆదాయపు పన్ను చెల్లించేవారు అనర్హులు

ఇటీవల కాలంలో మత్స్యకార గ్రామాల్లోని యువతలో చాలామంది సాఫ్ట్‌వేర్ తదితర ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు. అలా ఆదాయపు పన్ను చెల్లించేవారి కుటుంబ సభ్యుడు భత్యపు సొమ్ము పొందేందుకు అనర్హుడు అవుతున్నాడు. విద్యార్థులు కూడా అనర్హుల జాబితాలో చేరుతున్నారు. ఈ క్రమంలో వారిని కూడా అర్హుల జాబితాలో స్థానం కల్పించాలని కోరుతున్నారు.

నూకల కోసం రూకలు అరువు

నెల రోజులుగా ఎలాంటి సంపాదన లేకపోవడంతో మత్స్యకారులు ఇబ్బంది పడుతున్నారు. చేతిలో ఉన్న కొద్దిపాటి పొదుపు సొమ్ము కూడా ఖర్చయింది. బతుకు పోరాటంలో నూకల కోసం రూకలు అరువు తెచ్చుకోవల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భత్యం సొమ్ము చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అరువు తీసుకునే రొక్కానికి వడ్డీతో కలిపి తిరిగి చెల్లించాల్సి వస్తోందని వారు వాపోతున్నారు. బోట్లు, వలలు మరమ్మతులతో సంధి కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని, వెంటనే భత్యం సొమ్మును తమ ఖాతాల్లోకి జమ చేయాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు.


ఆకు పూజలో పాల్గొన్న భక్తులు

శింగరకొండలో భక్తుల రద్దీ

అద్దంకి, మే 18 : శింగరకొండలో శనివారం భక్తుల రద్దీగా పెరిగింది. విద్యార్థులకు వేసవి సెలవులు కావడం, పలు పరీక్షల ఫలితాలు రావడంతో పిల్లలతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో మొక్కు తీర్చుకునేందుకు తరలివచ్చారు. అదే సమయంలో పొలం పనులు పూర్తి కావడంతో రైతులు కూడా తమ కుటుంబాలతో వచ్చి పొంగళ్లు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆకు, వాహనపూజలలో భక్తులు భారీగా పాల్గొన్నారు.


కూల్ డ్రింక్ తాగుతున్న కోతి

కోతికి కూల్ డ్రింక్

ఆసక్తిగా గమనించిన భక్తులు

అద్దంకి, మే 18 : ఓ వానరం కూల్... కూల్‌గా కూల్ డ్రింక్ తాగుతూ భక్తులను ఆశ్చర్యానికి గురి చేసింది. శింగరకొండలో కొండపైన లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం వద్ద శనివారం మధ్యాహ్నం మండుటెండకు భక్తులు కూల్ డ్రింక్ కొనుగోలు చేశారు. కోతి ఠక్కున వచ్చి ఆ కూల్ డ్రింక్‌ను లాక్కుంది. దర్జాగా అక్కడే కూర్చొని తాపీగా కూల్ డ్రింక్ బాటిల్ మూత తీసుకొని తాగటం ప్రారంభించింది. ఒక గుక్క తాగటం... మరలా కొద్ది సేపు ఆగటం చేస్తూ 250 ఎంఎల్ బాటిల్ తమ్స్‌పను తాగేసింది. కోతి తాపీగా కూల్ డ్రింక్ తాగడాన్ని భక్తులు ఆసక్తిగా చూస్తూ తమ సెల్‌ఫోన్లలో వీడియోలు, ఫొటోలు తీసుకున్నారు. కోతి కూల్‌డ్రింక్ తాగి అలా ఎండ నుంచి సేదతీరింది.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

చీరాలటౌన్, మే 18 : ఖరీఫ్ 2024కు సంబంధించి చీరాల మండల పరిధిలోని రైతులు రాయితీతో కూడిన విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లో పొందాలని వ్యవసాయాధికారి సుమతి తెలిపారు. తొలకరి వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు ఇప్పటికే ఆర్బీకెల్లో ఉంచినట్లు చెప్పారు. సిబ్బందిని సంప్రదించాలని ఏవో తెలిపారు.

బల్లికురవ : రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలను అందజేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. మండలానికి 40 క్వింటాళ్ల జీలుగ, 40 క్వింటాల్ల జనుములు, 30 క్వింటాల్ల పిల్లిపెసర విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని అవసరమైన రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సబ్సిడీ పోను జీలుగ, రూ.44, జనుములు రూ.44 పిల్లిపెసర రూ.67 వంతున అందజేస్తున్నామని ఏవో తెలిపారు.

విద్యాకానుక స్టాక్ పాయింట్ పరిశీలన

మార్టూరు, మే 18 : జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యాకానుక స్టాక్ పాయింట్ ఉన్న గదులను విద్యా కానుక జిల్లా తనిఖీ బృందం సభ్యులు సీఎంవో శ్రీనివాసరావు, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ విద్యాసాగర్ శనివారం పరిశీలించారు. అంతకు ముందు స్థానిక విద్యా శాఖ కార్యాలయంలో సీఆర్‌పీలతో వారు సమావేశం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యాకానుకపై సీఆర్‌పీలతో చర్చించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వస్రాం నాయక్, ప్రేమలత, సీఆర్‌పీలు రమేష్, రామారావు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరి జ్యోతుల తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మే 18 : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభుని పేటలోని శ్రీచౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో జ్యోతుల తిరునాళ్ల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు ఉదయం నుండే బారులు తీరారు. అంతేకాకుండా అమ్మవారి పసుపు, కుంకుమ మహోత్సవంను వైభవంగా జరిపారు. మధ్యాహ్నం నుండి గ్రామంలో కలశం ఊరేగింపునిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించగా ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

23న ఆంజనేయస్వామి తిరునాళ్ల

ఇంకొల్లు, మే 18 : శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి వారి 70వ వార్షిక జయంతి మహోత్సవం ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. పావులూరు ఆంజనేయస్వామి తిరునాళ్ల ఈనెల 21 మంగళవారం మొదలై మూడు రోజుల పాటు జరుగుతుందని తెలిపారు. చివరి రోజు గురువారం తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్రయాహ్నిక జయంత్యుత్సవం, శ్రీసువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణంతో పాటు ఆలయ ప్రాంగణంలో హరికథ, ఘంటశాల పాటల కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

అయ్యప్పని దర్శించుకున్న గొట్టిపాటి

అద్దంకి, మే 18 : ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం శబరిమల లో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఎన్నికలు ముగిసిన అనంతరం మూడు రోజుల పాటు అద్దంకి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల టీడీపీ నేతలతో సమీక్షలు నిర్వహించారు. శుక్రవారం శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకున్న అనంతరం హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి శబరిమలకు వెళ్లిన రవికుమార్ సాయంత్రం అయ్యప్పస్వామిని దర్శించుకొని పూజలు చే శారు.


ప్రత్యేక పూజలు.. అన్నప్రసాద వితరణ

చీరాల, మే 18 : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని శనివారం చీరాల, పేరాల, వేటపాలెంలలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయాల కమిటీల ప్రతినిధులు తగిన ఏర్పాట్లు చేశారు.

రేపటి నుంచి జేవీవీ కిడ్స్ సమ్మర్ క్యాంప్

అద్దంకిటౌన్, మే 18 : జన విజ్ఞాన వేదిక అద్దంకి డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పట్టణంలోని ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల, గోరకాయపాలెం జడ్పీహెచ్ఎస్ నందు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏకకాలంలో జేవీవీ కిడ్స్ సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని బాధ్యులు తంగా శ్రీనివాసరావు, కావూరి రఘుచంద్ శనివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ తరగతులు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు జరుగుతాయని, ఈ క్యాంప్‌లో డ్రాయింగ్, ఫన్ మ్యాథ్స్, మ్యాజిక్, సైన్స్ ప్రయోగాలు, ఫన్ గేమ్స్, సాంగ్ వంటివి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ క్యాంప్‌కు వచ్చే విద్యార్థులు 50రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని తెలిపారు. కాగా గోరకాయపాలెం జడ్పీహెచ్ఎస్‌లో క్యాంప్‌లో తరగతులకు వెళ్లే విద్యార్థులు ఎటువంటి ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. వివరాలకు 9490598587, 9247176680 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఈఏపీసెట్‌లో సోపిరాల విద్యార్థికి ర్యాంక్



చినగంజాం, మే 18 : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన నరహరి రోహిత్ శివశంకర్ తెలంగాణ ఈఏపీసెట్-2024 ఫలితాలలో 181వ ర్యాంక్ సాధించాడు. తెలంగాణ రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఈఏపీసెట్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో 181వ ర్యాంక్ సాధించినట్లు రోహిత్ శివశంకర్ శనివారం తెలిపారు. తన తల్లిదండ్రులు పద్మ, శ్రీహరిరావు ఇచ్చిన ప్రోత్సాహంతో ఈ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. తన తండ్రి శ్రీహరిరావు తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ పోటీ పరీక్షల కేంద్రాలలో అర్థమ్యాథ్స్, వేదిక్ మ్యాథ్స్‌ను బోధిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన జరిగే జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు శిక్షణ పొందుతున్నట్లు రోహిత్ శివశంకర్ తెలిపారు. ఈఏపీసెట్‌లో ర్యాంక్ సాధించిన రోహిత్ శివశంకర్‌కు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు అభినందనలు తె లిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

పేరాల(చీరాలటౌన్), మే 18 : విద్యార్థి దశలో క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని తద్వారా ఉన్నతంగా రాణిస్తారని పద్మభాస్కర్ ఫౌండర్ ఘంటా అనిల్‌కుమార్ అన్నారు. ఇటీవల ఏడవ తరగతిలో ఉన్నతంగా రాణించిన పేరాలకు చెందిన విద్యార్థినికి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా దాత అనిల్ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులను విద్యతో ముడివేయరాదని, లక్ష్యాలను చేరుకోవాలంటే ధృఢ సంకల్పంతో ముందుకు సాగాలన్నారు. విద్యతో ఉన్నత శిఖరాలను అందుకోవచ్చని చెప్పారు. ఫౌండేషన్ స్థాపించి నిరుపేదలకు, విద్యార్థులకు, వృద్ధులకు చేయూత అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.


విద్యార్థినికి సైకిల్‌ను అందజేస్తున్న అనిల్‌కుమార్

వైభవంగా వాసవీమాత జన్మదిన వేడుకలు


గుండ్లకమ్మ నది నుంచి 102 కలశాలతో నీరు తెచ్చిన మహిళా భక్తులు

అద్దంకి, మే 18 : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. గుండ్లకమ్మ నది నుంచి మహిళా భక్తులు 102 కలశాలతో జలం తీసుకు వచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. గణపతి పూజ, నవ గ్రహ పూజ, వాసవీ మాత హోమం నిర్వహించారు. సామూహిక లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణాన్ని నిర్వహించారు. లక్ష మల్లెలతో అమ్మవారికి ప్రత్యేకార్చన చేశారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని చినగంజాం, పెదగంజాం గ్రామాల్లో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలో అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని పూజారి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. తదనంతరం అమ్మవారిని వి శేషంగా అలంకరించి విశేష పూ జలు, సామూహిక సహస్ర కుంకుమార్చన పూజలు జరిపారు. అమ్మవారి చిత్రపటం, కలిశాలతో మహిళా భక్తులు, వా సవీ వనితా క్లబ్ సభ్యులు గ్రామ పుర విధులలో గ్రా మో త్సవం నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాలు, బాణసంచాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి మందిర కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, వాసవీ వనితా క్లబ్ సభ్యుల ఆ ధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మార్టూరులో విశేష అలంకరణలో అమ్మవారు


కలశాలతో గ్రామోత్సం నిర్వహిస్తున్న భక్తులు

పర్చూరు : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అ మ్మవారి జయంతి వేడుకలు శనివారం స్థానిక అమ్మవారి ఆలయంలో అత్యంత వైభవంగా ని ర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాకార్యక్రమాలు చేపట్టారు. 102 కలశాలతో గ్రామోత్సవం నిర్వహించి పంచామృత అభిషేకాలు చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీరాం వెంకటసుబ్బారావు నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం శ్రీ భగవాన్ సత్యసాయిబాబా భక్త సమాజం వారిచే భజన జరిగింది.

మార్టూరు : శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలను శనివారం మార్టూరులో బొడ్డురాయి సెంటర్‌లో ఉన్న అమ్మవారి దేవ స్థానంలో భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి చి లకలూరిపేటలోని రాంలక్ష్మణ్ క్లాత్ షోరూం వారు బహూకరించిన పట్టు చీరతో అ మ్మవారిని అందంగా అలంకరించారు. అదేవిధంగా మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. అంతేగాకుండా అర్చకులు అ మ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నిరుపయోగంగా కోట్ల విలువైన స్థలం

- పట్టించుకోని వ్యవసాయ శాఖాధికారులు
- వినియోగంలోకి తేవాలని రైతుల విజ్ఞప్తి


మార్టూరులో నిరుపయోగంగా వ్యవసాయ శాఖకు చెందిన భవనం

మార్టూరు, మే 18 : వ్యవసాయ శాఖకు చెందిన స్థలం దాదాపుగా ఐదు సెంట్ల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం ఉన్న మార్కెట్ విలువ ప్రకారం రెండు కోట్ల రూపాయలు ఉంటుంది. మార్టూరులో నడిబొడ్డున ఈ స్థలం దాదాపుగా 20 ఏళ్ల నుంచి ఖాళీగానే ఉంది. మార్టూరులో గన్నవరం రోడ్డులో మంచి వ్యాపార కూడలిగా ఉన్న ప్రదేశంలో ఉన్న ఈ స్థలంలో ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం భవనం శిథిలమైంది. దాంతో ఈ భవనం నిరుపయోగంగా పనికి రాకుండా ఉంది. వాస్తవంగా గతంలో మార్టూరు నియోజకవర్గం ఉన్నపుడు సంతమాగులూరు సమితి ఉన్నపుడు ఈ భవనాన్ని వ్యవసాయాధికారి కార్యాలయ భవనంగా వినియోగించేవారు. 2009నాటికి మార్టూరు నియోజకవర్గం రద్దు కావడం, అనంతరం మార్టూరు పర్చూరు నియోజకవర్గంలో చేరడం జరిగింది. వ్యవసాయ శాఖకు చెందిన స్థలంపై వ్యవసాయ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గత ఐదేళ్ల క్రితం ఈ స్థలంలో రైతుల కోసం కార్యాలయం నిర్మించడానికి ప్రయత్నాలు జరిగాయి. కాని అది కార్యరూపం దాల్చలేదు. ఇక అప్పటి నుంచి ఈ వైసీపీ ప్రభుత్వ పాలనలో కూడా ఈ శిథిలమైన భవనం సంగతి గాని, వ్యవసాయ శాఖకు చెందిన స్థలం పైగాని సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడలేదు. మార్టూరులో వ్యవసాయాధి కార్యాలయం కొణిదెన రోడ్‌లో మార్కెట్ యార్డులో ఉన్న భవనాలలో నిర్వహిస్తున్నారు. వ్యవసాయ శాఖకు చెందిన ఈ స్థలంలో భవనం నిర్మిస్తే రైతులకు అందుబాటులో ఉండే విధంగా వ్యవసాయాధి కార్యాలయం నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతేగాకుండా మార్టూరు ఏడీఏ కార్యాలయం కూడా నిర్వహణకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఏడీఏ కార్యాలయం కూడా మండల కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్నారు. ఇదిలావుండగా కొంతమంది ఆక్రమణ దారులు వ్యవసాయ శాఖకు చెందిన స్థలంపై కన్నేశారు. మరి కొంత మంది వాటి ముందు స్థలాన్ని ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఎంతోవిలువైన స్థలాన్ని ఆ శాఖ వారు ఎందుకు నిర్లక్ష్యంగా వదిలేసి ఉంచారో అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ స్థలంలో వ్యవసాయ శాఖ వారు భవనం నిరిస్తే రైతులతో పాటు, అడపాదడపా రైతు శిక్షణ తరగతులు, నిర్వహించుకోవడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇకనైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాల్సిందే.

ఏబీసీలో పడి వృద్ధుడు మృతి


తన్నీరు లక్ష్మయ్య మృతదేహం

బల్లికురవ, మే 18 : మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య(65) శనివారం ఉదయం ఏబీసీ కాలువ మలుపులో ద్విచక్ర వాహనంతో కాలవలో పడిపోయి మృతి చెందారు. కొణిదెన గ్రామానికి చెందిన తన్నీరు లక్ష్మయ్య శుక్రవారం ఉదయం అద్దంకిలో బైకు బస్టాండ్‌లో పెట్టి బ్రహ్మంగారి మఠం అరాధన కార్యక్రమానికి వెళ్లి శనివారం ఉదయం అద్దంకి నుంచి బైకుపై కొణిదెనకు వస్తుండగా వల్లాపల్లి సమీపంలో ఉన్న ఏబీసీ కాలవ బ్రిడ్జి వద్దకు వచ్చే సరికి మలుపు అర్థంకాక బైకుతో సహా కాలవలోకి పడిపోయాడు. వెంటనే బాటసారులు గుంటుపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ అందుబాటులో వైద్యులు లేకపోవడం ఆక్సిజన్ అందుబాటులో లేకపోవడంతో వెంటనే మార్టూరు వైద్యశాలకు తరలించే లోపే అయన మృతి చెందారు. కాలవ వద్ద రక్షణ గోడలు లేకపోవటం వలనే ప్రమాదం జరిగిందని బంధువులు ఆరోపిస్తున్నారు. లక్ష్మయ్యకు భార్య ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఆదమరిస్తే కాలువలోకే..!

- దడ పుట్టిస్తున్న వల్లాపల్లి ఏబీసీ బ్రిడ్జి
- రక్షణ గోడలు కరువు
- ఇప్పటికే పలువురి వాహనాలు బోల్తా
- తాజాగా కొణిదెనకు చెందిన వ్యక్తి కాలువలో పడి మృతి
- ఆందోళనలో ప్రయాణికులు
- రెడ్ లైట్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి


ప్రమాదకరంగా ఉన్న ఏబీసీ కాలువ బ్రిడ్జి

బల్లికురవ, మే 18 : కొత్త వ్యక్తులు ఎవరైనా ఆదమరిచి వాహనాలను నడిపితే వారి పని అంతే సంగతులు. ఏబీసీ కాలువలపై ఉన్న బ్రిడ్జిల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది. వాహనాలను నడిపే వారు అయితే కాలువ మీద ఉన్న బ్రిడ్జి దాటే వరకు వారికి దడ పుడుతోంది. ఇరువైపులా దట్టంగా ఉన్న నీరు చుట్టూ రక్షణ లేకపోవడంతో వాహనాలను నడిపే వారు తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇప్పటికే సుమారు పది వాహనాల వరకు కాలవ బ్రిడ్జిలో బోల్తా కొట్టగా నలుగురు ప్రాణాలు వదిలారు. గత నెలలో వల్లాపల్లి వివాహానికి వస్తున్న ఒక వ్యక్తి కాలవ మలుపు అర్థంకాకపోవడంతో కాలువలో పడి తీవ్ర గాయాలపాయ్యాడు. ఈ మార్గంలో రాత్రుళ్ల ప్రయాణం అంటే కొత్త వ్యక్తులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవల్సిందే. అద్దంకి వైపు నుంచి దగ్గరకు వచ్చే వరకు ఈ మలుపు కనిపించటకపోవడంతో వాహనదారులు వేగంగా వచ్చి కాలువలోకి పడిపోతున్నారు. ఇంత ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ నీరు విడుదలైన సమయాలలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు పోతున్నాయి. కాలువకు రెండు వైపులా రెడ్ లైట్ సిగ్నల్స్, రక్షణ గోడలు కట్టి వేగ నియంత్రణ చర్యలు చేపడితే ప్రమాదాల సంఖ్య తగ్గించ వచ్చని ప్రయాణికులు అంటున్నారు. బల్లికురవ మండలం వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాల సమీపంలో ఏబీసీ కాలువపై రెండు బ్రిడ్జిలు ఉన్నాయి. ఎన్నో ఎళ్ల కిందట ఏర్పాటు చేసిన ఈ బ్రిడ్జిలు ఇప్పుడు శిథిలావస్థకు చేరాయి. ఏ సమయంలో కూలిపోతాయో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ బ్రిడ్జిలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఇనుప కడ్డీలు ఇప్పుడు ఊడిపోయాయి. దీంతో ప్రయాణికులు వాహనాలను బ్రిడ్జిలపై గుండా నడపాలంటే కింది ఉన్న నీటిని చూసి భయపడి పోతున్నారు. రాత్రుళ్ల అయితే వాహనదారులకు బ్రిడ్జి అర్థంకాక నీటిలోకి బోల్తా కొడుతున్నారు. రెండు వైపలా ఉన్న మలుపులతో వేగంగా వచ్చే వాహనదారులు అయితే వేగాన్ని నియంత్రించలేక నేరుగా ఏబీసీ కాలువలోకి వాహనాలతో పడిపోతున్నారు. గతంలో పలువురు కాలువలోకి వాహనాలతో పాటు పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. బల్లికురవ, సంతమాగులూరు, పల్నాడు జిల్లాకు చెందిన ప్రజలు అద్దంకి, ఒంగోలు వెళ్లేందుకు ఈ బ్రిడ్జిపై గుండానే ప్రయాణాన్ని సాగిస్తున్నారు. కొత్తగా ఈ రోడ్డులో వచ్చే వ్యక్తులు అయితే ఏబీసీ కాలువ బ్రిడ్జి అర్థంకాక కాలువ నీటిలో పడిపోతున్నారు. వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు కూడా ఈ బ్రిడ్జిలపై గుండా ట్రాక్టర్లు, ఎద్దుల ఆరకలు తీసుకు వెళ్లాలంటే భయపడుతున్నారు. శిథిలావస్థకు చెందిన బ్రిడ్జిపై గుండా ప్రతి రోజు పరిమితికి మించి గ్రానైట్ ముడిరాయిని లారీలలో రవాణా చేస్తున్నారు. ఈ రాయి లారీలు వెళుతుంటే చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు సైతం ఎప్పుడు బ్రిడ్జి కులిపోతుందో అని మనకు రాకపోకలు కూడా నిలిచిపోతాయని అందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఏబీసీ కాలువలపై ఉన్న బ్రిడ్జిలకు ఇరువైపులా రెడ్ లైట్ సిగ్నల్స్‌ను ఏర్పాటు ఏయాలని, రక్షణ చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.


ఏబీసీ కాలువ మీదుగా వెళ్లే మలుపు